సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



బాలరావమ్మ హుండీ లెక్కింపు

ఆగిరిపల్లి: తోటపల్లి శ్రీదుగ్గిరాల బాలరావమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా రూ.3,09,429లు వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు.



మల్లన్న తలపాగాకు పూజలు

అత్తిలి: మల్లన్న శోభాయాత్రలో భాగంగా అత్తిలి వచ్చిన మల్లన్న తలపాగాకు కర్ణ భక్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీరభద్రుడు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు.



వేడుకగా నగరేశ్వరుడి కల్యాణం

పెనుగొండ: పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషానురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో బుధవారం రాత్రి నగరేశ్వరుని కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

20 లోపు ఈ- కేవైసీ చేయించుకోవాలి



కంచుమర్రు ఆర్బీకేను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు

అత్తిలి: దాళ్వా ఈ-పంట నమోదుకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియ ఈ నెల 20తో ముగుస్తుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి జడ్.వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం అత్తిలి మండలం కంచుమర్రులో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంకా వేలిముద్రలు వేయించుకోవాల్సిన రైతులు సమీప రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ వద్ద ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్ నందు ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్మడానికి, పంటనష్ట పరిహారం, రైతు భరోసా, సున్నా వడ్డీ, పంట బీమా వర్తిస్తాయన్నారు. దాళ్వాసాగుకు సంబంధించి నూరు శాతం ఈ క్రాప్ పూర్తిచేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ రోజు 15 శాతం చొప్పున ఈ నెల 20లోగా నూరు శాతం ఈ-క్రాప్ పూర్తిచేయాలన్నారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాలలో అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వోదయ స్త్రీ శక్తి పురస్కారానికి ఎంపిక



అడుసుమిల్లి నిర్మల

సాక్షి, భీమవరం: సర్వోదయ మండలి స్త్రీశక్తి పురస్కారానికి ఏలూరుకు చెందిన అడుసుమిల్లి నిర్మలను ఎంపిక చేసినట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధానకార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవతా సేవలు, మహిళాభ్యుదయానికి గత రెండు దశాబ్దాలుగా పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో విశేష సేవలందించినందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కస్తూర్బా గాంధీ 79వ వర్ధంతిని పురస్కరించుకుని 2023వ సంవత్సరానికి అవార్డును అందచేయనున్నట్లు ప్రసాదరాజు చెప్పారు.

మార్టేరు పరిశోధన స్థానం సిబ్బంది ప్రతిభ



మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సిబ్బందిని అభినందిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: తిరుపతి వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సిబ్బందికి గత వారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆటలు, సాంస్కృతిక పోటీల్లో గోదావరి మండల సిబ్బంది 11 బహుమతులు గెలుచుకున్నారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీ డాక్టర్ ఎం భారతలక్ష్మి తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్న ఈ పోటీలలో 6 వాతావరణ మండలాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు. వివిధ విభాగాలలో పాల్గొన్న గోదావరి మండల సిబ్బంది క్విజ్ పోటీలో మొదటి బహుమతి, 100 మీటర్ల పరుగుపందెం, రిలే పరుగు పందెం, నడక పోటీలు, గ్రూప్ డ్యాన్స్, ఏకపాత్రాభినయం విభాగాలలో తృతీయ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్గో కౌంటర్ ప్రారంభం



తణుకులో కార్గో కౌంటర్ ప్రారంభిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలు ప్రజాదరణ పొందుతున్నాయని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డు పాతబస్టాండ్ సమీపంలోని సోమేశ్వరస్వామి షాపింగ్ కాంప్లెక్స్‌లో బుధవారం ఏపీఎస్‌ఆర్టీసీ ఆథరైజ్డ్ కార్గో కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కార్గో ద్వారా కవర్లు, పార్సిల్స్ డోర్ డెలివరీ సౌకర్యం ఉందని చెప్పారు. పట్టణ పరిధితోపాటు గ్రామాల్లో సైతం కార్గో ఏజెంట్లుగా పనిచేసేందుకు 98491 69396 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కైకలూరు టీడీపీలో కల్లోలం

- జయమంగళ బాటలోనే ముఖ్య నేతలు, పార్టీ కేడర్
- టీడీపీ నియోజకవర్గ సమావేశం రసాభాస
- నియోజకవర్గ బాధ్యతలు తీసుకునేందుకు ముందుకురాని నేతలు
- కష్టపడిన వారికి పార్టీలో విలువ లేదని ఆగ్రహం
- నేడు వైఎస్సార్‌సీపీలోకి జయమంగళ వెంకటరమణ



గన్ని వీరాంజనేయులు సమక్షంలో నాయికులను నిలదీస్తున్న టీడీపీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి



మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావుతో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు జానీ, మాల్యాద్రి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కై కలూరు నియోజకర్గ టీడీపీలో కల్లోలం రేగింది. ప్రస్తుతం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ టీడీపీకి రాజీనామా చేసి అధికార వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకోనుండటంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. టీడీపీలో తీవ్ర అసంతృప్తితో ఉన్న కేడర్ అధిష్టానాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధించింది. మరోవైపు ఇన్‌చార్జిగా ఎవరినైనా కొంతకాలం పెట్టి పార్టీని నడపడానికి సన్నాహాలు చేస్తున్నా, ఇన్‌చార్జి పదవికి ముఖ్యులంతా ముఖం చాటేస్తుండటంతో తెలుగుదేశం పార్టీ డైలామాలో పడింది. ఇప్పటికే టీడీపీ రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ గురువారం వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు.

హడావుడిగా టీడీపీ నేతల భేటీ

దాదాపు మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో జయమంగళ వెంకటరమణ క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. బీసీ నేతగా నియోజకవర్గంలో పట్టు ఉండటంతో 1998లో కై కలూరు జెడ్పీటీసీగా గెలుపొందారు. అనంతరం 2009లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో పార్టీ అంతర్గత వెన్నుపోట్లతో టికెట్ కోల్పోయారు. మళ్ళీ 2019లో చివరి నిమిషంలో టికెట్ ఇచ్చినా నియోజకవర్గంలో వెన్నుపోటు రాజకీయాలతో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో అనేక హామీలు, పార్టీపరంగా రాజకీయ ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు పలు పర్యాయాలు చెప్పినప్పటికీ ఆయనను పూర్తిగా విస్మరించారు. దీంతో టీడీపీ తీరుపై విరక్తి చెంది పార్టీకి రాజీనామా ప్రకటించడంతో టీడీపీ అంతర్మథనంలో పడింది. బుధవారం హడావుడిగా నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మాజీ ఎంపీ మాగంటి బాబు నివాసంలో ఏర్పాటు చేశారు. అది కాస్తా రసాభాసగా సాగింది.

నేతలతో వాగ్వాదం : దీంతో కేడర్‌ను కాపాడుకోడానికి మాగంటి బాబు, ఏలూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, బొర్రా చలమయ్యలు సమావేశానికి హాజరయ్యారు. ప్రారంభంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జానీకి కనీసం వేదికపై చోటు ఇవ్వకపోవడంతో నిలదీశారు. అతనికి మద్దతుగా రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.మాల్యాద్రి వేదికపై నాయకులను ప్రశ్నించారు. దీంతో గన్ని వీరాంజనేయులు సర్దిచెప్పారు. సమావేశం అనంతరం జానీ, మాల్యాద్రిలు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావుకు ఈ విషయాన్ని చెప్పారు. ఈ నేపథ్యంలో కమ్మిలి విఠల్, జానీ, మాల్యాద్రిల మధ్య మాటల యుద్ధం జరిగింది.

పోటీ కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిక

వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న జయమంగళ ప్రధాన అనుచరులను పొమ్మనలేక పొగబెడుతున్నారని జానీ, మల్యాద్రి మండిపడ్డారు. ఇన్నాళ్లు పార్టీ కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తే ఇప్పుడు గెంటేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇలాగైతే టీడీపీలో విడిగా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ.. మీది నాతో మాట్లాడే స్థాయి కాదని, నా మాటలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది.

కొనసాగుతున్న రాజీనామాల పర్వం



టీడీపీకి రాజీనామా చేసిన గుర్రాజు

తెలుగుదేశం పార్టీకి కైకలూరు నియోజకవర్గంలో కాలం చెల్లే పరిస్థితి దాపరించింది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ టీడీపీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తానని మంగళవారం ప్రకటించిన విషయం విధితమే. అదే బాటలో టీడీపీ రైతు అధికార ప్రతినిధి సయ్యపురాజు గుర్రాజు పార్టీ పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని చంద్రబాబుకు లేఖ పంపారు. జయమంగళతో పాటు వైఎస్సార్‌సీపీలోకి వెళుతున్నట్లు స్థానికలతో చెప్పారు. గుర్రాజు బాటలోనే మరికొందరు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి త్వరలో రానున్నట్లు సమాచారం.

డీఎన్నార్‌ను కలిసిన జయమంగళ



కైకలూరులో డీఎన్నార్‌ను కలిసిన మాజీ టీడీపీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ

కై కలూరు: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తానని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ స్పష్టం చేశారు. కై కలూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎన్నార్‌కు జయమంగళ పూలమాల వేసి ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. ముందుగా డీఎన్నార్ మాట్లాడుతూ జయమంగళ వెంకటరమణ టీడీపీ పాలనలో అణచివేతకు గురైన బీసీ నాయకుడన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో కలిసి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి జయమంగళ పేరును ఎమ్మెల్సీగా సూచించామన్నారు. కొల్లేరు అభివృద్ధికి సీఎం జగన్ చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. జయమంగళ రాకతో కొల్లేరు ప్రజలకు మరింత చేరువగా పథకాలను అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే జయమంగళ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు మాట విని టిక్కెట్టును కామినేని శ్రీనివాస్‌కు త్యాగం చేశానన్నారు. తనకు మొదటి ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పిన చంద్రబాబు మోసం చేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కొల్లేరు కాంటూరు కుదింపుపై అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. నేడు సీఎం జగన్ కొల్లేరు రీసర్వే, రెగ్యులేటర్ల నిర్మాణం, పెద్దింట్లమ్మ వారధి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. భవిష్యత్తులో డీఎన్నార్ భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించడానికి కృషి చేస్తానని చెప్పారు. కొల్లేరులంక గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తానని చెప్పారు. గురువారం మధ్యాహ్నం సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసి ఆయన సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు జయమంగళ తెలిపారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు వినయ్, శ్యామ్‌కుమార్, టీడీపీకి రాజీనామా చేసిన రాష్ట్ర నాయకుడు సయ్యపురాజు గుర్రాజు ఉన్నారు.

రీసర్వేలో తేడాలు రాకూడదు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



మహదేవపట్నంలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేసి కచ్చితమైన రికార్డులు రూపొందించాలని కలెక్టర్ పీ.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉండి మండలం మహదేవపట్నంలో ఆమె పర్యటించి రీసర్వే పనులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరును, జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనులన్నీ కచ్చితత్వంతో జరగాలని అన్నారు. సర్వే చేస్తున్న సమయంలో భూయజమాని తన సరిహద్దులను అధికారులకు చూపిస్తూ సహకరించాలన్నారు. సర్వే పనుల కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న డ్రోన్‌లను వినియోగిస్తున్నామని అన్నారు. వందేళ్ళ క్రితం జరిగిన భూసర్వే మళ్ళీ ఇప్పుడు నిర్వహించడం ద్వారా ఎన్నో భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. భూయజమానులంతా రీసర్వేకు సహకరించాలని కోరారు. జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు నేడు పనులు నాణ్యతతో జరగాలని సూచించారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్ల నిర్మాణాలకు పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మరుగుదొడ్లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తతంగా తీసుకువెళ్ళాలన్నారు. మందుల కొరత లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డీ మల్లేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, తహసీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఎంఈవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎథిక్స్ పరీక్షకు 29,480 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బుధవారం నిర్వహించిన నైతికత, మానవ విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్షకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 29,480 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 250 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో జనరల్ కేటగిరిలో 29,480 మంది హాజరు కాగా.. ఒకేషనల్ కేటగిరీలో 4214 మందికి 200 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 97 కేంద్రాల్లో జనరల్ కేటగిరీలో 11,189 మందికి 10,975 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1854 మందికి 1782 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 110 కేంద్రాల్లో నిర్వహించిన జనరల్ కేటగిరీ పరీక్షకు 14,101 మందికి 13,935 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1549 మందికి 1485 మంది హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలోని 43 కేంద్రాల్లో జనరల్ 4622 మందికి గాను 4570 మంది హాజరు కాగా 52 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

ఆపదమిత్రలు అవగాహన కల్పించాలి

డీఆర్వో కృష్ణవేణి



ఆపదమిత్రలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆపదమిత్రలు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. భీమవరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో బుధవారం 10వ బెటాలియన్ ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆపదమిత్రలకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదమిత్రలు శిక్షణ విషయాలను ప్రజలకు, పాఠశాలలో విద్యార్థులకు, పరిశ్రమలలో సిబ్బందికి అవగాహన కల్పించడంతోపాటు, మాక్ డ్రిల్ ప్రదర్శించాలన్నారు. జిల్లాలో యలమంచిలి, నరసాపురం, ఆకివీడు, భీమవరం, ఆచంట, పెంటపాడు, మొగల్తూరు, పెనుగొండ మండలాల్లో ఎంపిక చేసిన 247 మందికి ఆపదమిత్రలుగా శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేయడంలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం 10వ బెటాలియన్‌లోని బృంద సభ్యులు ఎంవీఆర్ నాయుడు, ఎస్.రామారావు, జి.శంకరరావు, ఆర్.కుమార్ రాజా, ఎస్.ఆదినారాయణ ఆపదమిత్రలకు ప్రమాదాలను ఎదుర్కోవడంలో అవగాహన కల్పించారు.

దంపతుల ప్రాణాలు కాపాడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

బుధవారం నరసాపురంలో అవగాహన కార్యక్రమాన్ని ముగించుకొని కలెక్టరేట్‌లో కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న సందర్భంలో మార్గ మధ్యంలో పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల వద్ద పి.వేణుగోపాల్- సంధ్య దంపతులు ప్రమాదానికి గురయ్యారు. అటుగా వస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వెంటనే వారికి ప్రథమ చికిత్స చేసి, దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించారు.

సొంతింటి కల సాకారమైన వేళ

- జిల్లాలో ఇంతవరకు 18,249 జగనన్న ఇళ్లు పూర్తి
- వివిధ దశల్లో మరో 50 వేల ఇళ్లు
- ఇంతవరకూ రూ.397.50 కోట్ల బిల్లులు చెల్లింపు



పాలకోడేరు మండలం మోగల్లు లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారు. సొంతిల్లు కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టించి అండగా నిలుస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలో 609 లేవుట్లలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సాయంతో పాటు రుణం తీసుకుని ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే అనేకమంది నిర్మాణం పూర్తి చేసుకుని వాటిలో ఉంటుండగా.. మరికొందరు శరవేగంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు.

18,249 ఇళ్లు పూర్తి

జిల్లాలో 1531.308 ఎకరాల్లో 609 లేవుట్‌లు వేయగా.. 71,864 ఇళ్లు మంజూరు చేసింది. ఇంతవరకు 18,249 వేల ఇళ్లు పూర్తి చేయగా వాటిలో 18 వేల మంది గృహప్రవేశాలు చేశారు. సుమారు 249 ఇళ్లు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. మరో 50 వేల ఇళ్లు శ్లాబ్, బేసిమెంట్ తదితర దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లేవుట్లలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఇసుక బల్క్ పాయింట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి వారికి అవసరమైన సహాయం అందించి ఇళ్లు వేగంగా పూర్తిచేసేలా చూస్తున్నారు.

లబ్ధిదారులు హర్షం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పట్ల ప్రేమతో ఇచ్చిన ఇంటి స్థలం నేడు లక్షల రూపాయల ఆస్తిగా నిలిచిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సెంటు రూ.2 లక్షల నుంచి 8 లక్షల వరకు పలికే విలువైన స్థలాలను ఉచితంగా అందించి మా జీవితాలకు భరోసా ఇచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని అంటున్నారు. అద్దె ఇంటి బాధలు తీరుతున్నాయని అద్దె ఇంటి నుంచి సొంతింటికి చేరిన లబ్ధిదారుల చెబుతున్నారు. గతంలో రాజశేఖరెడ్డి పాలనలో తమ తల్లిదండ్రులకు ఇంటి స్థలాలు, ఇళ్లు వచ్చాయని తర్వాత ఏ ప్రభుత్వం కూడా పేదవాడికి స్థలం గానీ ఇల్లు గానీ ఇవ్వలేదని లబ్ధిదారులు గుర్తుచేసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా నిర్మాణాల వివరాలు

జిల్లాలో మొత్తం మండలాలు	19
మొత్తం మంజూరైన ఇళ్లు	72,688
ఇళ్ల స్థలాల లేవుట్‌లు	609
ప్రభుత్వం ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన భూమి (ఎకరాల్లో..)	1531.308


వేగంగా ఇళ్ల నిర్మాణాలు



జిల్లా వ్యాప్తంగా 609 లేవుట్లలో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. 18,249 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 50 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేలా తగు చర్యలు తీసుకుంటున్నాం. లేవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కూడా సరఫరా చేయడానికి బల్క్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం. లేవుట్లలో మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

ఈనెల 18న సుందరగిరిపై మహాయజ్ఞం



సుందరగిరిపై కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మహా సంపుటిత శ్రీ లక్ష్మీనృసింహ ధన్వంతరీ 29వ మహా యజ్ఞ క్రతువు గురువారం ప్రారంభం కానుంది. అందులో భాగంగా ఈనెల 16, 17 తేదీల్లో విశేష కార్యక్రమాలు జరుగుతాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 18న రాత్రి మహా యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన యజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ తెలిపారు. మరుసటిరోజు 19న శాంతి కల్యాణాన్ని ఘనంగా జరుపుతామన్నారు.

క్లుప్తంగా

అబార్షన్ కిట్ల స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

భీమవరం(ప్రకాశం చౌక్): లైసెన్స్, బిల్లులు లేని అబార్షన్ కిట్లు (మందుల)ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జున్ బుధవారం రాత్రి చెప్పారు. ఏలూరు మండలం చాటపర్రుకు చెందిన పల్లే నగేష్ నుంచి భీమవరానికి చెందిన ఖండవల్లి సుధాకర్‌కు సుమారు రూ.3.90 లక్షల విలువ చేసే అబార్షన్ కిట్లు భీమవరం బస్టాండ్‌కు పార్శిల్‌గా పంపాడన్నారు. వాటిని సుధాకర్ అందుకోగా, వాటిని స్వాధీనం చేసుకుని తనిఖీ చేయడంతో అక్రమ మందులుగా గుర్తించినట్లు తెలిపారు. సుధాకర్, నగేష్‌లపై కేసు నమోదు చేసినట్లు మల్లికార్జున్ తెలిపారు. ఈ కేసుకు భీమవరం కోర్టుకు సమర్పిస్తామని పేర్కొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

నరసాపురం రూరల్: నరసాపురం పంట కాలువలో సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుని శరీరంపై నలుపురంగు ప్యాంటు, నలుపురంగు చారలు కలిగిన తెల్లని రంగు చొక్కా ఉన్నాయన్నారు. రుస్తుంబాద వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కే శ్రీనివాసరావు చెప్పారు.

బిల్లు కలెక్టర్ సస్పెన్షన్

నరసాపురం రూరల్: కొప్పర్రు మేజర్ పంచాయతీ బిల్లు కలెక్టర్ కైల త్రిమూర్తులును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఎల్‌పీఓ ఎం.నాగలత బుధవారం చెప్పారు. రెండేళ్లలో వసూలు చేసిన ఇంటి పన్ను రూ.3,79,082, కుళాయిల బిల్లు రూ.7,68,000 సొమ్మును పంచాయతీకి జమ చేయకుండా దుర్వినియోగం చేయడంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు.

కార్చిచ్చుకు చెక్

వేసవిలో ఏటా అడవులు తగలబడిపోతుండటం సర్వసాధారణమైంది. దీనివల్ల వృక్ష సంపదకు, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటుండగా, అడవిలో అగ్నిప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అడవిలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు, అటవీ సంరక్షణలో భాగంగా 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్స్, ఫైర్ బ్లోయర్స్‌ను అటవీ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు.

- అడవుల్లో అగ్ని ప్రమాదాల కట్టడికి ముందస్తు చర్యలు
- సాంకేతికత సాయంతో అడవుల సంరక్షణకు కసరత్తు
- 50 కి.మీ పరిధిలో ఫైర్‌లైన్స్, ఫైర్ బ్లోయెర్ల ఏర్పాటు
- ఏలూరు జిల్లాలో 1.32 లక్షల హెక్టార్లలో విస్తరించిన అడవులు

బుట్టాయగూడెం: జాతీయ అటవీ విధానం ప్రకారం మూడో వంతు భూభాగంలో చెట్లు ఉండాలి. ప్రస్తుత ఏలూరు జిల్లాలో సుమారు 1.32 లక్షల హెక్టార్ల పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 85 శాతం ఏజెన్సీ ప్రాంతంలోనే ఉందని అధికారులు చెబుతున్నారు. బుట్టాయగూడెం మండలంలో 21,879 హెక్టార్లు, పోలవరంలో 27,927 హెక్టార్లు, జీలుగుమిల్లిలో 8,908 హెక్టార్లు, వేలేరుపాడులో 29,476, కుక్కునూరులో 22,259, టి.నర్సాపురంలో 4384, చింతలపూడిలో 6,780, కామవరపుకోటలో 1,178, లింగపాలెంలో 2,119, గోపాలపురంలో 649, ద్వారకాతిరుమలలో 813, నల్లజర్లలో 2,174, పెదవేగిలో 1,332, ఉంగుటూరు మండలంలో 1,226 హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది.

కారణాలు ఇవే..

ఏటా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయి. అదేవిధంగా ఆకు రాలే కాలం కూడా. ఆ సమయంలో అటవీ ప్రాంతంలో చింతపండు, ఇప్పపూలు, అడ్డపిక్కలు తదితర అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవిలోకి వెళ్లిన వారిలో ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి వెలిగించి అనుకోకుండా పక్కకు వేసిన సమయంలో అప్పటికే ఎండి ఉన్న ఆకులపై అగ్గిపుల్ల పడితే మెల్లగా గాలికి మంటలు చెలరేగి అనుకోకుండా అడవిని చుట్టేసే ప్రమాదాలు ఉంటాయి. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల, చెట్ల కొమ్మల రాపిడి వల్ల కూడా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి.



అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్స్ పనులు చేస్తున్న దృశ్యం



అడవిలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టె



వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలను నివారణ చర్యలు తీసుకుంటున్న అటవీ సిబ్బంది



ఫైర్ బ్లోయెర్స్ ద్వారా మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

నివారణ చర్యలు ఇలా..

వేసవిలో అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు మూడు మీటర్ల వెడల్పులో గడ్డి చెక్కి ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తారు. అలాగే ఫైర్ బ్లోయర్ అనే పరికరం కూడా అగ్నిప్రమాదాల నివారణకు వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా మోనిటరింగ్ సెల్‌లో అడవులకు సంబంధించిన ఒక కోడ్‌ను నమోదు చేస్తారు. అడవిలో అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అందరికీ ఒక్కసారిగా సమాచారం చేరుతుంది. దీంతో అప్రమత్తమై ఫైర్‌ను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటారు.

జంతు సంరక్షణకు కృషి

వేసవిలో వన్యప్రాణుల సంరక్షణపై కూడా అటవీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. అడవిని అగ్ని ప్రమాదాల నుంచి రక్షించడంతో పాటు వన్యప్రాణులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడతారు. వేసవిలో నీటి సమస్య ఎక్కువగా ఉండడంతో జంతువులు సంచరించే ప్రదేశాల్లో చిన్న నీటికుంటలు, తొట్టెలు ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు నీటితో నింపుతారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



అడవులు, జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ వాచర్స్ ద్వారా కృషి చేస్తున్నాం. 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీ ప్రాంతంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో మంచినీటి చలమలు తీస్తున్నాం. ఇవి రెండు నెలల వరకూ ఉంటాయి. దీనివల్ల జంతువులకు ఎటువంటి సమస్య ఉండదు.

– దావీదు రాజు నాయుడు, అటవీశాఖ డీఆర్‌ఓ, పోలవరం

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఆగిరిపల్లి: బైక్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. ఎస్సై ఎస్.చంటిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలటూరుకు చెందిన ముల్లంగి దేవమ్మ పోతవరప్పాడులోని ఆమె అక్క కొడుకు నందూరి కుమార్ ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 13న గ్రామంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో రోడ్డులో నడుస్తూ వెళుతుండగా వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధురాలికి తలకు తీవ్ర గాయం కాగా, ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహ నిశ్చితార్థం అడ్డుకున్న అధికారులు

పోడూరు: గుమ్మలూరులో బాల్య వివాహ నిశ్చితార్థాన్ని అధికారులు అడ్డుకున్నారు. వీఆర్వో బి.లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక, పెనుమదం గ్రామానికి చెందిన ఆమె మేనత్త కొడుకు (27) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ విషయం తెలిసిన ఇరు కుటుంబాలు త్వరలో ఇద్దరికీ వివాహం చేయాలని నిర్ణయించారు. బుధవారం నిశ్చితార్థం జరుతుండగా సమాచారం అందుకున్న సచివాలయ, రెవెన్యూ అధికారులు, మహిళా పోలీసు అక్కడికి వెళ్లి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. వీఆర్వో లక్ష్మీనారాయణ, సచివాలయ కార్యదర్శి వర్మ ఇరు కుటుంబాల పెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఇద్దరూ మేజర్లు అయ్యాకే వివాహం జరిపిస్తామని వారి నుంచి హామీ పత్రాలు తీసుకున్నారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ: పెనుగొండలోని జిలంచెరువులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

శివయ్య పెండ్లికొడుకాయెనె



ద్వారకాతిరుమల శివాలయంలో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శైవ ఆగమయుక్తంగా ప్రారంభమైన కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు, పండితులు స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను చేశారు. ముందుగా ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ శివయ్యను పెండ్లి కుమారునిగాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను ముస్తాబు చేశారు. ఆలయ ఏఈఓ పి.నటరాజారావు వేడుకలో పాల్గొని, ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్పందన ఫిర్యాదుపై ఎఫ్‌డీఓ పరిశీలన



కోమటిగుంటలో చెరువును పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ రాంబాబు

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పంట బోదెను ఆనుకుని చేపల చెరువులు తవ్వుతున్నారనే ఫిర్యాదుపై ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ రాంబాబు బుధవారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన గుర్రం వెంకట పరమేశ్వరరావు, మంతెన నాగాంజనేయులుతో పాటు పలువురు రైతులు ఇటీవల స్పందనలో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. పంటబోదెకు మూడు మీటర్లు వదిలి ఆక్వా చెరువులు తవ్వుకోవాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టంగా ఉన్నా అవేమీ పట్టించుకోకుండా పంటబోదె అంచును చేర్చి చెరువు గట్టు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్‌డీఓ బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇరుపక్షాల రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా ముందుకెళతామన్నారు. ఈయన వెంట ఫిషరీస్ అసిస్టెంట్ సత్యనారాయణ రైతులు ఉన్నారు.

ఆర్చరీలో ప్రతిభ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు రోజులుగా నిర్వహించిన అంతర్ జిల్లా ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. అండర్–14 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బి.గాయత్రి విజేతగా నిలిచింది. ఆమె జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ చేతులమీదుగా పతకం, సర్టిఫికెట్ అందుకుంది.

ద్వారకాతిరుమలలో గో అందాలు, పాల పోటీలు

- మార్కెట్ యార్డు ఆవరణలో ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు నిర్వహణ
- గో ఆధారిత, ప్రకృతి వ్యవసాయంపైనా వర్కుషాపు
- ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి విలేకరులకు వెల్లడి



ద్వారకాతిరుమల సన్నాహక సభలో మాట్లాడుతున్న చక్రపాణి

ద్వారకాతిరుమల: జాతీయ స్థాయిలో ఒంగోలు, పుంగనూరు జాతి ఆవుల అందాలు, పాల పోటీలను దాతల సహకారంతో వచ్చేనెల 17 నుంచి 19 వరకు స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తామని ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి చక్రపాణి చెప్పారు. మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన సన్నాహక సభ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పోటీల్లో భాగంగా తొలిరోజు 17న ఎంట్రీలు స్వీకరిస్తామని, 18, 19న పోటీలు జరుపుతామన్నారు. అలాగే గో ఆధారిత, ప్రకృతి వ్యవసాయంపై పెద్ద ఎత్తున వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ఏ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామనేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఒంగోలు జాతి అభివృద్ధికి, రైతులను ప్రోత్సహించేందుకు, పాల ఉత్పత్తులను పెంచేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఒంగోలు జాతి ప్రపంచంలోనే మేలైన జాతి అని, 21 దేశాల ఆర్థిక పరిస్థితి ఒంగోలు జాతిపై నడుస్తోందన్నారు. నిరాదరణకు గురవుతున్న ఒంగోలు జాతి అంతరించిపోకుండా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. పర్యావరణం దెబ్బతిని రైతు తీవ్రంగా నష్టపోతున్న ప్రస్తుత తరుణంలో గోఆధారిత, ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆశాజనకంగా మారిందన్నారు. పోటీల్లో పాల్గొనే రైతులు 94401 88336, 94404 34250, 95151 80491 నంబర్లలో సంప్రదించాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి గోపీకాంత్ విశ్వనాథం, ప్రకృతి వ్యవసాయం జిల్లా కో–ఆర్డినేటర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయం రీజనల్ కో–ఆర్డినేటర్ శివరాం, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధుడి సజీవ దహనం

రెండు తాటాకిళ్లు దగ్ధం



గుళ్లపూడిలో అగ్నికి ఆహుతైన ఇల్లు, సజీవ దహనమైన వృద్ధుడు



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: గుళ్లపూడిలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిల్లు దగ్ధం కాగా, ఒక ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధుడు సజీవ దహనం అయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని దళితవాడలో అన్నాదమ్ములు పిల్లి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పక్కపక్కనే ఉన్న తాటాకిళ్లల్లో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వెంకటేశ్వరరావు ఇంట్లో తండ్రి పిల్లి అప్పారావు (70) మంచంపై నిద్రిస్తుండగా, పక్క ఇంట్లో వెంకటేశ్వరరావు భార్య, చిన్నారితో కలిసి బయటకు పరుగులు పెట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి ఉధృతం కావడంతో పాటు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో స్థానికులు భీతిల్లారు. దీంతో సహాయ కార్యక్రమాలు చేసేందుకు వచ్చిన యువకులు సైతం వెనుకడుగు వేశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న వృద్ధుడు అప్పారావు సజీవ దహనమయ్యాడు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఆస్తి నష్టం 2 లక్షల రూపాయల వరకు ఉండవచ్చని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. సమాచారం తెలుసుకున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఘటనా స్థలాలకు చేరుకుని బాధిత కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున, ప్రభుత్వం తరపున తహసీల్దార్ దాసరి సుధ రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.50 వేలు తక్షణ సహాయాన్ని అందజేశారు.

గంజాయి, చోరీ కేసుల్లో పది మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్,



స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగ్‌లు, మద్యం

తాడేపల్లిగూడెం అర్బన్: పలు కేసుల్లో పది మంది నిందితులను పట్టణ, రూరల్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 24 కిలోల గంజాయి, రూ.3.50 లక్షల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ యూ రవిప్రకాష్ చెప్పారు. తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుల వివరాలను వెల్లడించారు. గంజాయి రవాణా చేస్తున్న షేక్ అక్బర్, గుత్తుల రవికుమార్, దెందుకూరి చిదంబర వెంకటరాజులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెడ్డి నారాయణ, యర్రసాని వెంకటరావు, బెజవాడ నాగరాజు, ఉయ్యాల పుల్లయ్యలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 36 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా చైన్‌స్నాచింగ్, చోరీలకు పాల్పడిన మహ్మద్ షాకర్‌ఖాన్, షావేజ్‌ఖాన్, అస్లామ్ అలియాస్ గుడ్డులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్పెషల్ పోలీస్ డ్రైవ్‌లో 45 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, ఐఎంఈఐ నంబర్ల ద్వారా యజమానులను గుర్తించి వీటిని అప్పగిస్తామన్నారు. ఈ కేసుల్లో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు. టౌన్ సిఐ నాగరాజు, ఆకుల రఘు, ఎస్సైలు రాజు, ప్రసాద్, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక మహిళ తన కుమార్తె, మనుమడు అదృశ్యమైనట్టు ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. శరభాపురానికి చెందిన గుదే సుబ్రమ్మ కుమార్తె సున్న రత్నకుమారి భర్తను విడిచి పుట్టింట్లో ఉంటోంది. ఈ నెల 13న ఉదయం ద్వారకాతిరుమల ఆస్పత్రికి అని చెప్పి తన బిడ్డను తీసుకుని ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ లభించకపోవడంతో సుబ్రమ్మ స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



తణుకులో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరించిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయులంతా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసే దిశగా కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డైరీని మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.విక్టర్ రవి సాగర్, పశ్చిమ గోదావరి జిల్లా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జిజే ప్రభువరం, మురాల సుధాకర్, ఏలూరు వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జిజే స్టీవెన్, ఎంబీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జావెద్, ఉపాధ్యాయులు బలరాం, సంజయ్, జయరాజు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్: దేశరక్షణలో ప్రాణాలర్పించిన వీరజవాన్లు అమరులని దేశప్రజలకు చిరస్మరణీయులని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎస్ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో వీరజవాన్లకు నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఎస్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ వీర జవాన్ల ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని దేశానికి తమదైన శైలిలో సేవలందించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ తోట సూర్యనారాయణ, గుణ్ణం మార్కండేయులు, బ్యాంకు సిబ్బంది అమరజవాన్లకు నివాళులర్పించారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

తణుకు టౌన్: ఈనెల 16వ తేదీన తణుకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు ఎలుకల నిర్మూలనకు సంబంధించిన మందును ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె కుసుమ తెలిపారు. దాళ్వా సీజన్‌లో వరి పంటలో ఎలుకలు పంట నష్టం కలగచేయకుండా ఉండేందుకు ప్రభుత్వ అందించిన బ్రోమోడైల్ 25 సీజీ ఎలుకల మందును గురువారం అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు అందజేస్తారని తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులు తమ వేలిముద్రలు వేసి ఆయా ఆర్‌బీకేల్లో మందును పొందవచ్చని తెలిపారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెంటపాడు: ఉత్తమ దిగుబడులకు రైతులు తప్పక వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆకుతీగపాడులో పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం రైతులకు పంట యాజమాన్య పద్ధతులు, క్షుణ్ణంగా వివరించారు. పంట చిరుపొట్ట దశలో ఉన్న సందర్భంగా 20 కేజీల పోటాష్, 45 కేజీల యూరియా ఎకరాకు వేసుకోవాలన్నారు. పంటకు వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. గింజ తోడుకుంటుందన్నారు. గింజ నాణ్యత ఈ ఎరువులు వేసుకోవాలని డీఏవో సూచించారు. ప్రస్తుతం పురుగు ఉదృతి తక్కువ ఉందన్నారు. ఏ విధమైన పురుగు మందులు, దోమల మందులు వాడవద్దన్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడిలు సాధించేలా రైతులు మార్పుచెందాలన్నారు. నియోజకవర్గంలో సామూహిక ఎలుకల నియంత్రణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా రైతుల భరోసా కేంద్రాల వద్ద ఉచితంగా మందు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంట ఈకేవైసీ ఈనెల 20 లోపు పూర్తి చేసుకోవాలన్నారు. దీనివల్ల రైతుల కొనుగోలు జరుగుతుందన్నారు. ఏడీఏ పి. మురళీకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో తణుకు ఏడీఏ రమేష్, మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కైగాల శ్రీనివాస్, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు

గల్ఫ్‌లో చిక్కుకున్న బాధితులను రప్పించాలని విజ్ఞప్తి

తణుకు: ఉపాధి కోసం విదేశాలు వెళ్లి అక్క వివిధ కారణాలతో చిక్కుకున్న బాధితులను స్వదేశానికి రప్పించాలని ప్రముఖ సామాజికవేత్త పెంటపాటి పుల్లారావుకు బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తణుకులోని పుల్లారావు ప్రతినిధులు కాకిలేటి హరినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఖత్తర్ వెళ్లిన కావలిపురం గ్రామానికి చెందిన దొంగ లక్ష్మీపద్మ, మస్కట్‌లో చిక్కుకున్న తాడేపల్లిగూడెం మండలం పడాలకు చెందిన తాతపూడి శ్రీదేవి, దుబాయిలో చిక్కుకున్న వడ్లూరుకు చెందిన గమ్మిడి సునీతలను స్వదేశానికి రప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం జడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, దొంగ దుర్గారావు, గుడాల సాయికృష్ణ, కేతా నాగరాజు పాల్గొన్నారు.



తణుకులో పుల్లారావు ప్రతినిధులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బాధితులు

నేడు సంతాన గోపాలస్వామివారి కల్యాణం

అత్తిలి: ఈనెల 16న అత్తిలిలో గల శ్రీరుక్మిణీ సత్యభామా సమేత సంతాన గోపాలస్వామి కల్యాణం జరుగుతుందని ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త లింగంపల్లి పాండురంగరావు తెలిపారు. గురువారం ఉదయం స్వామివారికి సహస్రనామార్చన, విశ్వక్సేన పూజ, జవ్వాది సురేష్, కుసుమ దంపతులచే స్వామివారి కల్యాణం జరిపిస్తారని చెప్పారు. అనంతరం అఖండ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

నిర్మాణాత్మక ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు నిర్మాణాత్మక ఆలోచనలతో ముందుకెళ్లాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి అన్నారు. విజన్ బిల్డింగ్‌పై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏపీఎం లక్ష్మి మాట్లాడుతూ గ్రామ సంఘాల పరిధిలో ఉన్న పరిస్థితులను, రాబోయే రోజుల్లో ఏం చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందనే నిర్మాణాత్మక ఆలోచనలను ఒక చార్ట్ రూపంలో పొందుపర్చాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, డ్రెయిన్లు, రోడ్లు, గ్రంథాలయాలు, ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయా ? లేదా ? అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించడం వంటి అంశాలపై సీసీలు రేఖారమణి, హిమబిందులు డ్వాక్రా మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రామ సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీపై విమర్శలు తగవు

తాడేపల్లిగూడెం అర్బన్: కంటికి కనిపిస్తున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై తెదేపా నాయకులు విమర్శలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు పేర్కొన్నారు. బుధవారం ఉపముఖ్యమంత్రి కొట్టు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు నిర్వహించిన విలేఖరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి తెదేపా ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంతో పాటు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఒక్కో కుటుంబంలో అమ్మ ఒడి, జగనన్న చేయూత, వైఎస్సార్ అసరా తదితర పథకాలతో పాటు ఇటీవల కల్యాణమస్తు పథకంలో మొదటిగా మైనార్టీ వర్గాలకు షాదీ తోఫాను అందించామన్నారు. సమావేశాల్లో మనం వెల్లడించే విషయాలు ప్రజలు నమ్మబలికేలా ఉండాలన్నారు. రాజకీయంలో అందరూ అర్హులేఅన్నారు. అవగాహన లోపంతో అజ్ఞానంతోను బహిరంగ సమావేశాల్లో మాట్లాడిన నాయకులు అర్భాటాన్ని ప్రజలు గుర్తిస్తారన్నారు. ప్రజలకు చెప్పే విషయాలు వాస్తవాలై ఉండాలన్నారు. ఉనికిని కాపాడుకోవడం కోసం వైఎస్సార్ సీపీని విమర్శిస్తే సహించేది లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పై, ఉపముఖ్యమంత్రి కొట్టుపై అవాస్తవాలను ప్రచారం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను నియోజకవర్గ ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో తిరిగి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. నాయకులు బొద్దాని శ్రీనివాస్, సంపతరావు కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆశ్రమంలో సర్వమత సమ్మేళనంపై అవగాహన

తణుకు: పట్టణంలోని పాతవూరులోని జీఎస్‌సీ పిల్లల ఆశ్రమంలో బుధవారం సర్వమత సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హోం డైరెక్టర్ మల్లిపూడి శాంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మత ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పురప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మత సామరస్యంపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేష్ అఘోరా స్వామీజీ, న్యాయవాది సుబ్బరాజు, వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, టీడీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు కలగర వెంకటకృష్ణ, మల్లిన రాధాకృష్ణ, బొద్దాని నాగరాజు, బిషప్ జగ్జీవన్, అబ్దుల్ రెహ్మాన్, నారాయణకుమార్ పాల్గొన్నారు.



తణుకులోని ఆశ్రమంలో అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

ముత్యాలమ్మవారికి రూ.18వేలు విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మవారి వెండి చీర నిమిత్తం ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు గ్రామానికి చెందిన యర్రా పుల్లారావు దంపతులు బుధవారం రూ.18వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ ఈవో పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారి వెండి చీర నిమిత్తం విరాళం అందజేస్తున్న దంపతులు

నేడు విద్యుత్ నిలుపుదల

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో 16వతేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యవతినగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్‌ను మరమ్మతులు చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో పట్టణంలోని వీకర్స్‌కాలని, ఎఫ్‌సీఐ కాలని, కోతిబొమ్మ సెంటర్, వానపల్లిగూడెం ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పైబోయిన కుటుంబానికి పలువురు పరామర్శ



అత్తిలిలో పైబోయిన విజేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంతెన యోగేంద్రబాబు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు, అత్తిలి సొసైటీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ కుటుంబ సభ్యులను బుధవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. పైబోయిన విజేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించి, నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ కేంద్రపాలక మండలి సభ్యులు చీర్ల రాధయ్య, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు, మద్దాల రమణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, బల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

తణుకు పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

తణుకు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 9 నుంచి 21 వరకు కోడ్ అమల్లో ఉన్నందున తణుకు మున్సిపల్ పరిధిలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, ఫోటోలు ప్రదర్శించకూడదని చెప్పారు. బ్యానర్లు, వాల్‌పోస్టర్లు అంటించకూడదని, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించకూడదని కమిషనర్ వెల్లడించారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని వైద్య సహాయకులు ఎంపీ వెంకట్రావు చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ బాల్య వివాహాలు కారణంగా మహిళల్లో ఏర్పడే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. కిషోర్ బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పోష్టికాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నలినీ రాణి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పెంటపాడు: విద్యార్థులు కెరీర్‌పై అవగాహన పెంచుకొని మంచి ఉద్యోగాన్ని సాధించాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మచారి పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు లోని స్థానిక కళాశాలలో అన్ని గ్రూపుల విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. షైన్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ జేవీ జయంతి, జాన్‌బాబు, ఆర్కే ఫణిధర్ పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని పట్ల యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఫిర్యాదు అందిందని ఎస్సై పి.అప్పారావు బుధవారం తెలిపారు. మంగళవారం విద్యార్థిని వెంటపడిన యువకుడు ఆమె చేయి పట్టుకుని అల్లరి చేశాడని, ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం, పెదతాడేపల్లి, మోదుగ గుంట, తాడేపల్లిగూడెంలోని ఎరువుల దుకాణాల్లో బుధవారం ఆకివీడు ఏడీఏ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. రికార్డులు సరిగా లేని 12.95 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, వీఏఏలు ఎం.ఆంజనేయులు, ఎం.మధురత్నం, సురేష్ ఉన్నారు.

చిట్యాలకు సినీ ఎగ్జిబిటర్ అవార్డు

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని శేషమహల్ థియేటర్ యజమాని చిట్యాల లక్ష్మీనరసింహమూర్తికి సినీ ఎగ్జిబిటర్ అవార్డును మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో అందచేసినట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈ అవార్డును అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగంటి మురళీమోహన్ చేతులమీదుగా అందుకున్నామన్నారు. 1980లో శేషమహల్ థియేటర్‌ను నిర్మించి అనేక సూపర్‌హిట్ చిత్రాలను ప్రదర్శించామన్నారు. ఉత్తమ సినీ ఎగ్జిబిటర్‌గా తనకు అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. సోదరుడు చిట్యాల రఘు పాల్గొన్నారు.

వీరంపాలెం శైవక్షేత్రాన్ని దర్శించిన జిల్లా ఎస్పీ



జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌ను శాలువాతో సన్మానిస్తున్న పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళవెంకటరమణ శాస్త్రి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి విద్యా, ఆధ్యాత్మిక పీఠాన్ని బుధవారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. శివరాత్రి ఏర్పాట్లపై ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రితో వారు చర్చించారు. అనంతరం జిల్లా ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ పీఠం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంలో మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మూర్తి, పోలీస్ సిబ్బంది, సందీప్ పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞానాన్ని అందిస్తాయి

సాక్షి, భీమవరం: విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించేవి పుస్తకాలేనని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. అరసవల్లి ఈశ్వరమ్మ- వీరవెంకటచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ శాఖా గ్రంథాలయానికి బుధవారం రూ. 40 వేలు విలువ చేసే పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయానికి అందించిన పుస్తకాలు నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంసెట్, ఇంజనీరింగ్, గ్రూపు వన్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉంచామన్నారు. పబ్లిక్ సర్వీసు కమిషన్, రైల్వే సర్వీసు వంటి ఉద్యోగాలకు సంబంధించి అవసరమైన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజు కోరారు. అనంతరం ఆర్డీవో రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, అల్లూరి సాయి దుర్గారాజు, చెరుకువాడ వెంకట్రామయ్య, అల్లు శ్రీనివాస్, వారణాసి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాతృ భాష దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): ఈనెల 17 నుంచి 21 తేదీ వరకు ప్రపంచ మాతృ భాష దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ రంగసాయి తెలిపారు. స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో బుధవారం దినోత్సవ వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గన్నాబత్తుల తులసమ్మ పెదతాత ట్రస్ట్ సౌజన్యంతో పట్టణ సాహితీ సంస్థల పాఠశాలు, కళాశాల సహకారంతో నిర్వహిస్తున్నామని, 17న జీటీపీ మహిళా కళాశాలలో వేడుకలను ప్రారంభిస్తామని, పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు తెలుగు భాషా ఔన్నత్యం తదితర అంశాలపై పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. 21న ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కలిగొట్ల గోపాల శర్మ, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాస రావు, ఏవీ గంగాధర్, నాచు శ్రీవల్లి, ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనతో మంచి భవిష్యత్

తణుకు టౌన్: మంచి జ్ఞాన సముపార్జన ద్వారా మంచి భవిష్యత్‌ను పొందుతారని ప్రముఖ నేత్ర వైద్యుడు డా.హుస్సేన్ అహ్మద్ చెప్పారు. బుధవారం తణుకులో గుడ్ సమిరిటన్ చిల్డ్రన్ హోంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. చదువు ఒక్కటే మనిషి అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజేష్ అఘోరా, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ బీ సుబ్బరాజు, కలగర వెంకట కృష్ణ, మల్లిన రాధాకృష్ణ, బొద్దాని నాగరాజు, ఎండీ కమాలుద్దీన్, హోమ్ నిర్వాహకులు ఎం శాంతి కుమారి, చదలవాడ సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని ముదునూరు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం గూడెంకు చెందిన కృష్ణవేణి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి డాక్టర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యపరీక్షలు, బ్లడ్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మా అమ్మా నాన్నలు ఇకపై నన్ను టీవీలో చూస్తారు' అని సంతోష పడింది మిన్ను మణి. దేశీయంగా ఆమె ఆడిన క్రికెట్ మేచ్‌లు టీవీలో టెలికాస్ట్ కాలేదు. 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం 30 లక్షలకు మిన్ను మణిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకున్నాక ఆమె ఆట తప్పక టెలికాస్ట్ కానుంది. రోజుకు నాలుగు బస్సులు మారి 52 కిలోమీటర్ల దూరంలోని క్రికెట్ స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసిన మణి కేరళలో ఈస్థాయికి ఎదిగిన తొలి గిరిజన మహిళా క్రికెటర్. మహిళా క్రికెట్ ఇప్పుడు విజయ పరంపరలో ఉంది. నిర్లక్ష్య వర్గాల నుంచి కూడా ఈ ఆటకు చేరొచ్చు అని చెబుతున్న మిన్ను మణిది కూడా ఒక విజయగాథ.

గిరిజన విజయం



మిన్ను మణి

'ముప్పై లక్షల రూపాయలు. నా జీవితంలో చూస్తానని అనుకోలేదు. మొదట నేనొక స్కూటీ కొనుక్కోవాలి. బస్సుల్లో తిరుగుతూ ప్రాక్టీసుకు ఇకపై వెళ్లను. ఆ తర్వాతే ఆ డబ్బుతో ఏం చేయాలో ఆలోచిస్తాను' అంది మిన్ను మణి.

ఫిబ్రవరి 13న ముంబైలో 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం మహిళా క్రికెటర్ల వేలం జరుగుతున్నప్పుడు మిన్ను మణి హైదరాబాద్‌లో సౌత్ జోన్ తరఫున ఇంటర్ జోన్ టోర్నమెంట్ ఆడుతోంది. ఆ రోజున 91 బాల్స్‌కు 74 కొట్టి నాటౌట్‌గా నిలిచింది. ఆట ఒకవైపు సాగుతూ ఉన్నా మనసంతా ముంబై ఆక్షన్ మీదే ఉంది.

'పెద్ద పెద్ద మహిళా క్రికెటర్లకు కూడా వేలంలో ధర పలకకపోతుండే సరికి నిరాశ కలిగింది. నా బేస్ ప్రైస్ 10 లక్షలు పెట్టారు. ఎవరూ తీసుకోరేమో అనుకున్నాను. కానీ ఢిల్లీ, బెంగళూరు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 30 లక్షలకు ఢిల్లీ కేపిటల్స్ నన్ను సొంతం చేసుకుంది. అప్పుడు నాకు కలిగిన ఫీలింగ్ మాటల్లో చెప్పలేను' అంది మిన్ను మణి.

'ఆ విషయం ఫోన్‌లో చెప్తే మా అమ్మా నాన్నలు డబ్బు గురించి కాక నా ఆట గురించి అడిగారు. టీవీలో వస్తుందా అన్నారు. వస్తుంది అని చెప్పాను' అంది సంతోషంగా.

■ కరూచియ

23 ఏళ్ల మిన్ను మణిది కేరళలోని వయనాడ్ జిల్లాలోని గిరిజన గూడెం. ఇది బ్రహ్మగిరి కొండల అంచున ఉంటుంది. మణిది 'కరూచియ' గిరిజన తెగ. వీళ్లు తమను తాము కొండ బ్రాహ్మణులుగా చెప్పుకుంటారు. తమ ఆచారాలు స్ట్రిక్ట్‌గా పాటిస్తారు. గురి చూసి బాణం వేయడంలో మేటిగా పేరు గడించారు. కాని ఇప్పుడు వారంతా చిన్న చిన్న పనులు చేసుకు బతుకుతున్నారు. మిన్ను మణి తండ్రి మణి రోజు కూలి. తల్లి వసంత గృహిణి. చిన్నప్పటి నుంచి మిన్ను మగపిల్లలతో కలిసి పొలాల్లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేది. ఎలిమెంటరీ స్కూల్లో రన్నర్‌గా ప్రతిభ చూపేది. 8 వ తరగతిలో హైస్కూల్లో చేరాక ఆమె ప్రతిభను ఆ స్కూల్లో ఎల్సమ్మ బేబీ అనే పీయీటీ టీచరు గుర్తించింది. 'మిన్ను రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్. రైట్ హ్యాండ్ బ్యాట్స్‌ఉమన్. బౌలింగ్‌లో బ్యాటింగ్‌లో ఆ అమ్మాయి టాలెంట్ చూసి చాలా దూరం వెళుతుందని అనుకున్నాను' అంటుంది ఆ పీయీటీ టీచర్. ఆ పీయీటీ టీచరే పూనుకుని తిరువనంతపురంలోని కేరళ క్రికెట్ అసోసియేషన్ దగ్గరకు తీసుకువెళితే వారు పరీక్షించి ట్రయినింగ్ ఇచ్చారు. దాంతో మిన్ను మణి ముందు వయనాడ్ జిల్లా జట్టుతో ఆటు పిమ్మట అండర్ 16 జట్టుతో ఆ తర్వాత కేరళ రాష్ట్ర మహిళా జట్టుతో ఆడటం మొదలుపెట్టింది.



తల్లి వసంతతో మిన్ను మణి

■ కష్టే ఫలి

అయితే మిన్ను మణి క్రికెట్ ఆడటానికి మొదట తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. 'కేరళలో అమ్మాయిలు అథ్లెట్లుగా రాణిస్తారు. నన్ను కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా చూడాలని మా అమ్మానాన్నలు అనుకున్నారు. క్రికెట్ మగవాళ్ల ఆట అని వారి అభిప్రాయం. కాని మా పీయీటీ టీచరు వారిని ఒప్పించి నన్ను క్రికెట్‌లోకి తీసుకెళ్లింది. నేను క్రికెట్ బాగా ఆడుతున్నానని తెలిశాక వారు మనస్ఫూర్తిగా ప్రోత్సహించసాగారు' అంది మిన్ను.

కానీ క్రికెట్‌లాంటి ఖరీదైన ఆటకు కావలసిన మంచి కిట్ కూడా మిన్ను దగ్గర లేదు. వాళ్ల నాన్న అప్పులు చేసి మిన్ను ఆట కొనసాగేలా చూశాడు. మిన్ను ప్రాక్టీసు చేయాలంటే వారి గూడేనికి 52 కిలోమీటర్ల దూరంలోని కృష్ణగిరి క్రికెట్ స్టేడియమే గతి. అంత దూరం వెళ్లడానికి మిన్ను తెల్లవారు జామునే లేచి ఇంటి పనుల్లో తల్లికి సాయం చేసి నాలుగు బస్సులు మారి స్టేడియంకు చేరుకునేది. తిరిగి ఇల్లు చేరే సరికి సాయంత్రం 7 అయ్యేది. 'అలిసిపోయేదాన్ని. కాని పట్టుదలగా ఆట కొనసాగించాను' అంటుంది మిన్ను.

■ ఆటలో విజయాలు


మిన్ను మణి కేరళ అండర్ 23లో ఆ తర్వాత భారత్ అండర్ 23 జట్టులో ప్రతిభ చూపింది. ఇండియా ఏ జట్టుకు ఎంపికై ఆడింది. విమెన్స్ ఆల్ ఇండియా ఒన్ డే టోర్నమెంట్‌లో 8 మేచ్‌లు ఆడి 246 పరుగులు చేసి 12 వికెట్లు తీసింది. దాంతో అందరి దృష్టి మిన్ను మీద పడింది. క్రికెట్ ఆడటం మొదలెట్టాక వచ్చిన కొద్ది పాటి డబ్బులో ప్రతి పైసా తన కోసం తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి ఉపయోగించింది. మిగిలిన డబ్బుతో చిన్న ఇల్లు కడితే 2018 వరదల్లో ఆ ఇల్లు దెబ్బతింది. క్రికెట్ అభిమానులు ఆదుకుని రిపేర్లు చేయించారు. ఇప్పుడు 30 లక్షల సంపాదన స్థాయికి మిన్ను చేరింది. 'దీని కంటే జాతీయ జట్టులో స్థానం పొందడమే నాకు ఎక్కువ ఆనందం. అదే నా లక్ష్యం' అంటోంది మిన్ను మణి.

సైబర్ టాక్

ఆన్‌లైన్‌లో డబ్బులు పోతే ఏం చేయాలి?!

కూతురు పుట్టినరోజుకు డ్రెస్ కొనుగోలు చేసిన సౌమ్య ఫోన్ యాప్ ద్వారా పేమెంట్ చేసింది. అయితే, పేమెంట్ మోడ్‌కి వచ్చేసరికి డబ్బులు డెబిట్ అయినట్టు బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చింది కానీ, షాప్ యజమాని ఖాతాలో నగదు క్రెడిట్ కాలేదు. దీంతో ఒకటికి రెండు సార్లు పేమెంట్ చేసింది. ఫెయిల్ అయిన ట్రాన్సాక్షన్ అమౌంట్ రిటర్న్ అవుతుందిలే అని ఊరుకుంది. కానీ, అలా రిటర్న్ అయిన మెసేజ్ ఏమీ రాలేదు. ఆ అమౌంట్‌ను తిరిగి ఎలా పొందడం, లేకపోతే అంతమొత్తం ఎలా వదిలేయడం.. ఓ రెండు రోజులు ఆగి చూద్దామా.. ఇలాంటి సందేహాలతోనే సౌమ్యకు ఆ రోజు గడిచిపోయింది.

ఇటీవల స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తికి ఆన్‌లైన్ పేమెంట్స్ గురించి తెలిసిందే. పండ్లు, కూరగాయల బండి వద్ద కూడా యాప్ ఆధారిత పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంటుంది. ఇందుకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్ వంటి వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతుంటాం, ఇలాంటప్పుడు సర్వర్ సరిగ్గా పనిచేయకనో లేదా మరో కారణంగానో ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోయినప్పుడు లేదా ఆన్‌లైన్ నగదు మోసాల జరిగినప్పుడు ఏం చేయాలో ప్రతిఒక్కరికీ అవగాహన తప్పక ఉండాలి.



ప్రతీకాత్మక చిత్రం

ఫిర్యాదులకు వేదిక

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (CFCFRM) అనేది భారతదేశంలో పౌరులు ఆర్థిక సైబర్ మోసాలను ఫిర్యాదు చేయడానికి ఒక వేదిక. ఆర్థిక సైబర్ మోసానికి సంబంధించిన సంఘటనలను నివేదించడానికి, నిర్వహించడానికి పౌరులకు అనుకూలమైన, సురక్షితమైన మార్గాన్ని అందించడం ఈ ప్లాట్‌ఫారమ్ లక్ష్యం. మోసానికి సంబంధించిన సంబంధిత పత్రాలు, సాక్ష్యాలను దీనిలో అప్‌లోడ్ చేయచ్చు. ఇది ఆర్థిక సైబర్ మోసాన్ని ఎలా నిరోధించాలనే దానిపై సమాచారం, మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. నివేదిక ఇచ్చాక, విచారణ కోసం సంబంధిత చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీకి పంపిస్తుంది. తగిన చర్య కోసం బ్యాంకింగ్ అధికారులకు పంపుతుంది. మోసగాడి ఖాతాలో బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంకు దానిని హోల్డ్‌లో ఉంచుతుంది. తర్వాత, ఫిర్యాదుదారు అధికారికంగా కోర్టుకు హాజరు కావాలి. ఆ పై డబ్బు బాధితుడి ఖాతాకు బదిలీ చేయబడుతుంది. ఈ స్థితిని ట్రాక్ చేయడానికి ఒక యంత్రాంగాన్ని అందిస్తుంది.

CFCFRM టోల్ ఫ్రీ నెంబర్: 1930

- వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలి (12 గంటల్లోపు)
- ప్రత్యామ్నాయంగా https://cybercrime.gov.in పోర్టల్‌కు లాగిన్ అయ్యి, ఫిర్యాదు చేయాలి.
- బ్యాంక్ అకౌంట్ నెంబర్, వాలెట్ యుపిఐ, లావాదేవీ ఐడీ, తేదీ, డెబిట్/క్రెడిట్ కార్డ్ నంబర్లు మొదలైనవి ఇవ్వాలి.
- సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, రసీదు సంఖ్యను ఎఫ్ఐఆర్‌గా మార్చవచ్చు.

RBI వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ : టోల్ ఫ్రీ నెం. 14448

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 'వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ పథకం' అందుబాటులోకి వచ్చింది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర ఎలక్ట్రానిక్ చెల్లింపు వ్యవస్థలకు సంబంధించిన వాటితో సహా అన్ని డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి వినియోగదారులకు ఒకే పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ అందించడం ఈ పథకం లక్ష్యం.

ఈ పథకం కింద, వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి, పరిష్కరించడానికి ప్రతి రాష్ట్రంలో ఆర్‌బిఐచే నియమించబడిన అంబుడ్స్‌మన్ ఉంటారు. ఫిర్యాదులను స్వీకరించడం, విషయాన్ని విచారించడం, ఫిర్యాదు సరైనదేనని తేలిన సందర్భాల్లో బాధిత వినియోగదారులకు పరిహారం అందించే అధికారం ఈ అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. అంబుడ్స్‌మన్ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేస్తారు. వారి నిర్ణయాలకు బ్యాంకింగ్ సంస్థలు కట్టుబడి ఉంటాయి.

దశల వారీగా నివేదించే ప్రక్రియ...

- సంబంధిత యుపిఐ సర్వీస్ ప్రొవైడర్ పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పె మొదలైన వాటిపై ఫిర్యాదు.
- టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి.
- https://cms.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ చేసి, ఫిర్యాదు ఇవ్వచ్చు.
- మీ ఫిర్యాదును CRPC@rbi.org కి ఇ-మెయిల్ చేయచ్చు. (బ్యాంక్ స్టేట్‌మెంట్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు / యుపిఐ, యాప్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు/ పంపిన, స్వీకరించిన ఫోన్ నంబర్లు రెండింటినీ జత చేయాలి)
- బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంక్ దానిని హోల్డ్‌లో ఉంచుతుంది, తర్వాత ఫిర్యాదుదారు ఖాతాకు బదిలీ చేస్తుంది.

డబ్బులు ఇరుక్కుపోతే..

డబ్బులు బదిలి చేసినప్పుడు మన అకౌంట్ నుంచి డిడక్ట్ అయినా అవతలి వారికి వెళ్లకపోవడం, లేదా పేమెంట్ ఆగిపోవడం వంటివి జరిగినప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా యుపిఐ వివాదానికి పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు.

ప్రతి కస్టమర్ PSP యాప్ (పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు) / TPAP యాప్ (థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు)లో UPI లావాదేవీకి సంబంధించి NPCI పోర్టల్ https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanism లో ఫిర్యాదు చేయవచ్చు.

ఈ కింది కారణాల వల్ల మాత్రమే అభ్యర్థనలను ఇవ్వాలి..

(ఎ) ఖాతా నుంచి మొత్తం డెబిట్ అయ్యింది కానీ లబ్ధిదారునికి క్రెడిట్ కాలేదు (బి) ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యింది కానీ మొత్తం నగదు డెబిట్ అయ్యింది (సి) చేయాల్సిన ఖాతాకు కాకుండా వేరొక ఖాతాకు తప్పుగా బదిలీ అయ్యింది (డి) లావాదేవీ సమయం ముగిసింది కానీ ఖాతా నుంచి డెబిట్ అయ్యింది (ఇ) మోసపూరితమైన లావాదేవీ జరిగింది (ఎఫ్) నగదు లావాదేవీ పెండింగ్‌లో ఉండిపోయింది (జి) లావాదేవీ అసలు యాక్సెస్ అవలేదు (హెచ్) లావాదేవీ రిజక్ట్ అయ్యింది (ఐ) పరిమితిని మించి పొరపాటున లావాదేవీ జరిగింది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



మేకప్ ప్యాచ్‌లు కనిపించకుండా...

వయసు పైబడటం వల్ల చర్మం ముడతలు పడుతుంటుంది. మెడ, గొంతు ప్రాంతంలో చర్మం ముడతలు పడడాన్ని, చారికలు రావడాన్ని గమనించవచ్చు. ఈ సమస్య నివారణకు మెడ వ్యాయామం చాలా అవసరం. ఆకాశాన్ని చూస్తున్నట్టుగా తల పైకి ఎత్తి, తిరిగి నెమ్మదిగా కిందకు దింపాలి. ఇలా నాలుగైదు సార్లు చేయాలి. ఇలా రోజులో 5-6 సార్లుచేస్తూ ఉంటే మెడ దగ్గర చర్మం బిగుతుగా మారుతుంది. అలాగే మెడ, గొంతు దగ్గర మేకప్ వేసుకోవడానికి ముందు ఇలా చేయడం వల్ల మేకప్ ప్యాచ్‌లుగా కనిపించకుండా జాగ్రత్తపడవచ్చు.

మోచేతుల నలుపు తగ్గాలంటే...



- రోజూ స్నానానికి ముందు నిమ్మరసం రాసి, పది నిమిషాలు ఉంచాలి.
- టీ స్పూన్ కొబ్బరి నూనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి మోచేతులు, మోకాళ్లపై రాసి వేడి టవల్‌తో తుడవాలి.
- రెండు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ పంచదార కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్దాలి. ఇలా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.
- రెండు టీ స్పూన్ల పెరుగులో కొద్దిగా బాదం పొడి కలిపి నలుపుగా ఉన్న చోట రాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- పాల మీగడలో చిటికెడు పసుపు రాసి, నలుపుగా ఉన్న చోటరాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- టొమాటో రసం లేదా దానిమ్మ రసం తేనె లేదా నూనెతో కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్ది, శుభ్రపరుచుకుంటే నలుపు సులువుగా తగ్గుతుంది.
- నువ్వుల నూనెలో చర్మాన్ని మృదువుగా ఉంచే సుగుణాలు పుష్కలంగా ఉన్నాయి. వారానికోసారి స్నానానికి నువ్వుల నూనె ఉపయోగించడం వల్ల చర్మానికి కావల్సిన ఫ్యాటీ యాసిడ్స్ అంది, మృదువుగా అవుతుంది.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోసెల కోసం బియ్యం, మినప్పప్పు నానబెట్టేటప్పుడు ముందే కడగాలి. నానిన తర్వాత గ్రైండ్ చేసేటప్పుడు కడగడం వల్ల విటమిన్లు నీటిలో పోతాయి. అంతే కాకుండా దుకాణాల్లో వాటికి పురుగుపట్టకుండా నిల్వ చేయడానికి కీటక నాశినులను గనుక వాడి ఉంటే కడగకుండా నానబెట్టినప్పుడు ఆ అవశేషాలతో కూడిన నీటినే బియ్యం, మినప్పప్పు పీల్చుకుంటాయి కాబట్టి అవన్నీ శరీరంలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది.



- కూరల్లో ఉప్పు ఎక్కువైనప్పుడు అందులో బంగాళాదుంప ముక్కలను వేయాలి. అధికంగా ఉన్న ఉప్పును పొటాటో పది నిమిషాల్లో పీల్చుకుంటుంది.
- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్‌స్పూను నెయ్యి కలపాలి.



- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్‌స్పూను కార్న్‌ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.

● ఫెక్స్‌టింగ్!

'స్మార్ట్' వాదనలు అంత స్మార్ట్ కాదు!

భార్యాభర్తలు, జీవిత భాగస్వాముల మధ్య ఏదో అంశం మీద వాదోపవాదనలు, చిన్న చిన్న గొడవలు మామూలే. వాదన జరుగుతుండగా... ఆఫీసుకు వెళ్తూ తన పార్ట్‌నర్ నుంచి దూరంగా వెళ్తే గొడవ సద్దుమణగడం ఖాయం. కానీ మొబైల్ ఫోన్‌లో టెక్స్ట్ మెసేజీల రూపంలో అదే గొడవ అదే పనిగా కొనసాగితే...? ఇలా లైఫ్ పార్ట్‌నర్స్ మధ్య ఫైటింగ్ కాస్తా టెక్స్ట్ మెసేజీల రూపంలో కొనసాగడాన్ని 'ఫెక్స్‌టింగ్' అనే ధోరణిగా అభివర్ణిస్తున్నారు. మొబైల్స్ ఎన్నెన్నో కొత్త కొత్త రకాల ఫీచర్స్‌తో వస్తున్నాయి కాబట్టి వాటిని 'స్మార్ట్' ఫోన్స్ అన్నారు. కానీ 'ఫెక్స్‌టింగ్' అంత స్మార్ట్ కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

'ఫెక్స్‌టింగ్' అంటే కేవలం జీవిత భాగస్వాముల మధ్య ఫైటింగ్ అనే కాదు... పేరెంట్స్, ఫ్రెండ్స్ మధ్య కూడా కావచ్చుకానీ... అత్యధికంగా ప్రభావం చూపేది భార్యాభర్తల మధ్యనే కావడంతో సాధారణంగా దాన్ని లైఫ్‌పార్ట్‌నర్స్‌కే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అత్యంత ప్రఖ్యాతమైన ఓ సెలబ్రిటీ కేస్‌స్టడీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య,

జోబైడెన్, జిల్ బైడెన్



అమెరికన్ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌ల దాంపత్యం వయసు 45 ఏళ్ల పైమాటే. ఇటీవల ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాము వాదించుకునేందుకు టెక్స్ట్ మెసేజీలు వాడతామని చెప్పారు. అందుకు ఓ వినోదాత్మక కారణం కూడా తెలిపారు. తమ ఘర్షణ, వాదోపవాదాలు అమెరికన్ సీక్రెట్ ఏజెన్సీకి తెలియకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటామని సరదాగా వెల్లడించారామె. అంటే అందరి గుట్టుమట్లు పసిగట్టే అత్యంత సమర్థమైన ఏజెన్సీనే బురిడీ కొట్టించడానికి ఆమె 'ఫెక్స్‌టింగ్'ను ఎంచుకున్నారన్న మాట.

రెండు రకాల వాదనలు

ఫెక్స్‌టింగ్‌లో పార్ట్‌నర్స్ ఎదురెదురుగా ఉండరు కాబట్టి... ముఖ కవళికలూ, అందులోని ఆవేశాలూ, ఉద్వేగాలూ కనిపించవు. వాదన తాలూకు తీవ్రత అక్షరాల్లో అంతగా ప్రభావ పూర్వకంగా కనిపించదు కాబట్టి అంత హానికరం కాదనీ అనేవాళ్లూ ఉంటారు. అంతే కాదు... ఆ వాదన కొనసాగడానికి ఇష్టపడని వారు... టెక్స్ట్‌కు బదులుగా క్రమంగా 'స్మైల్' లేదా షేక్‌హ్యాండ్ ఎమోజీల్లాంటివి ఉపయోగిస్తూ పోతే, ఎదుటివారి నుంచి తగినంత ప్రతిస్పందన లేకపోవడంతో క్రమంగా వాదన సన్నగిల్లిపోతుందనీ, ఎదురుబొదురు ఉన్నప్పటంత హాని జరగకపోవచ్చనీ కొందరు చెబుతుంటారు.

సరిగ్గా దీనికి పూర్తి భిన్నంగా వాదించే వారూ ఉంటారు. మాటలు తడబడవచ్చు. ఏదో మాట సరిగా వ్యక్తం కాకపోవచ్చు. కానీ సరిగ్గా వ్యక్తీకరించగలిగేవాళ్లైతే రాతలోనే ప్రభావం ఎక్కువ అని చెప్పేవాళ్లూ ఉన్నారు.



ఎప్పుడైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు ఎదురుబొదురుగా ఉండి మాట్లాడుకోవడమే మంచిది. కొన్ని పదాలు, పంక్చువేషన్లు, ఎమోజీల వల్ల దురభిప్రాయాలు వచ్చే అవకాశమూ ఉంది. మాటల్లో చెప్పుకునే విషయాలను రాతలో పెట్టినప్పుడు అది మరింతగా హాని చేసే ప్రమాదం ఉంది. 'మీ అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు, కానీ మీ అభిప్రాయానికి విలువివ్వాల్సిందే' అనే పరస్పర గౌరవ భావన, దృక్పథాల వల్లనే మంచి ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ సుజాత రాజమణి,
మానసిక నిపుణులు

పాతగాయాలూ రేగే ప్రమాదం

దంపతుల మధ్య సంభాషణల రూపంలో ఎదురుబొదురుగా ఘర్షణలు జరుగుతున్నప్పుడు ఏదైనా మాటతూలినా గాలికి పోయే మాటల వల్ల ఆ తర్వాత ఎలాంటి ప్రభావమూ ఉండదు. కానీ 'రాత' ఎప్పటికీ నిలిచిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఆ తర్వాత ఎప్పుడో చదువుకున్నప్పుడూ పాత మాటలూ, పాత వాదనల ప్రభావాలు కెలికినట్లుగా అయి, అవి ఆ తర్వాతెప్పుడో కూడా ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని మరికొందరు చెబుతున్నారు.

అంతుఉండకపోవచ్చు... ఆ అంశమే ప్రమాదం తేవచ్చు...

పొద్దున్నే భార్యాభర్తల మధ్య వాదన చెలరేగింది. ఇద్దరూ తమ తమ పనులు చేసుకుంటూనే వాదనల్లో మునిగిపోయారు. ఆఫీసుకు బయల్దేరే సమయానికి ఘర్షణ పెద్దదైంది. కానీ ఆఫీసు సమయానికి ఎవరి దారిలో వాళ్లు వెళ్లిపోవడంతో ఆ 'వాదోపవాదాలు' అక్కడితో ముగుస్తాయి. కానీ 'ఫెక్స్‌టింగ్' అలా కాదు. ఆఫీసుకు వెళ్లే దారిలో బస్సులోనో, ఆటోలోనో లేదా మెట్రోరైల్ లోనో అలాగే కొనసాగవచ్చు. అంతేకాదు... ఆఫీసుకు చేరి, సీట్లలో కూర్చున్నాక కూడా అదేపనిగా కొనసాగితే ప్రమాదమే. ఆ మాటకొస్తే కీలకమైన మీటింగుల్లోనూ 'టెక్స్ట్ మెసేజు'లు కొనసాగుతూ... అసలు లక్ష్యానికి అడ్డంగా మారవచ్చు. టెక్స్ట్ వల్ల ఒనగూరే సౌలభ్యమల్లా వాదన మౌనంగా కొనసాగుతూ... అది మాటల ద్వారా బయటకు తెలియదంతే. కానీ పని ప్రదేశంలో... చేయాల్సిన పని వదిలేసి అదేపనిగా వాదులాడుకుంటూ పోతే... ఆఫీసులో పూర్తి చేయాల్సిన పనులు కొనసాగకపోగా / జరగకపోగా... అదే ఇబ్బంది తెచ్చిపెట్టే ప్రమాదమూ ఉందంటున్నారు కపుల్ కౌన్సెలింగ్ నిర్వాహకులు, మనస్తత్వ నిపుణులు. అంతేకాదు... అది పనితీరుతో పాటు, బంధాల విషయాల్లోనూ ప్రమాదం తెచ్చిపెట్టవచ్చునని హెచ్చరిస్తున్నారు.

వస్తువులో కాదు... అంతా మన విచక్షణలోనే ఉంది...

''ఏదైనా ప్రయోజనం అన్నది ఆ వస్తువును మనం ఉపయోగించే తీరులో లేదా మన విచక్షణను బట్టే ఉంటుందిగానీ... ఉపకరణంలో ఏమీ ఉండదు. ఇంగ్లిష్‌లో చెప్పాలంటే 'ఆబ్జెక్ట్'లో కాకుండా 'ఆబ్జెక్టివ్'లోనే అంతా ఉంది'' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు కొందరు మనస్తత్వ నిపుణులు.